www.siddipetpower.com

# సిద్ధిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 సంచిక: 151 హైదరాబాద్ బుధవారం 24-09-2025 పేజీలు: 05 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## కేసీఆర్ పోరాటం వల్లే సమ్మక్క – సారలమ్మ బ్యారేజీ సాధ్యమైంది

**సిద్ధిపేట(పవర్), హైదరాబాద్ :**

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కేసీఆర్ పోరాటం వల్లే సమ్మక్క - సారలమ్మ బ్యారేజీ సాధ్యమైందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ఈ బ్యారేజీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అనుమతులు సాధించినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు.

ఛత్తీస్‌గఢ్‌తో యాభై ఎకరాల ముంపునకు సంబంధించి అంగీకారం కుదిరితే ఏవో గొప్పలు సాధించినట్టు ప్రచారం చేసుకుంటున్నారు. సమ్మక్క బ్యారేజ్‌కు కొత్తగా అనుమతులు సాధించినట్టు డబ్బా కొట్టుకుంటున్నారు. 2001లో కేసీఆర్ చేపట్టిన తెలంగాణ ఉద్యమానికి చంద్రబాబు భయపడి దేవాదుల ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేశారు. రూ. 811 కోట్ల వ్యయంతో అప్పట్లో దేవాదులకు జీవో వచ్చారు. 2009లో గానీ ఆ ప్రాజెక్టు పూర్తి కాలేదు. రూ. 15 వేల కోట్ల నుంచి రూ. 20 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఆ ప్రాజెక్టు నుంచి సరిగా నీళ్లు తొడలేక పోయారు. ఇన్ టెక్ వెల్ కూడా సరిగా ఏర్పాటు చేయలేదు. 170 రోజులు నీళ్లు తోడాల్సిఉండగా 110 రోజులు కూడా దేవాదులతో నీళ్లు రాలేదు. 37 టీఎంసీల నీళ్లు కూడా కాంగ్రెస్ హయాంలో తోడలేదు. ఫుట్ వాల్ కూడా సరిగా పెట్టకుండా దేవాదుల డిజైన్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించకుండా కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును సరిదిద్దారు అని వినోద్ కుమార్ గుర్తు చేశారు.

దేవాదులను పటిష్టం చేసేందుకు ఏడు టీఎంసీల సామర్థ్యంతో సమ్మక్క సారక్క బ్యారేజ్‌ను కేసీఆర్ నిర్మించారు. సమ్మక్క బ్యారేజ్‌కు ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలతో సీడబ్ల్యూసీ అనుమతులు ఇవ్వలేదు. 2023 ఎన్నికల సందర్భంగా ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది.

# 100 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి..

- వారి సంప్రదాయాలు, విశ్వాసాల మేరకే ఆలయ నిర్మాణం!
- 100 రోజుల్లో మేడారం ఆలయ అభివృద్ధి
- ఆదివాసీ సంప్రదాయాలకు గౌరవం ఇస్తామని హామీ
- భక్తి, సంప్రదాయాలకు మించినది ఏదీ లేదు
- మేడారం ఆలయ పనులు వేగవంతం
- ఆలయ అభివృద్ధి అంటే డబ్బులు కాదు, భక్తి : సీఎం రేవంత్ రెడ్డి



**సిద్ధిపేట(పవర్), తెలంగాణ బ్యూరో:**

మేడారంలో శ్రీ సమ్మక్క, సారలమ్మ అమ్మవార్ల ఆలయ అభివృద్ధి, విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు, డిజైన్‌లను అధికారులు పూజారులకు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఈ ప్రణాళికలపై ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్న సీఎం, వారి ఏకాభిప్రాయం పొందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు.

మేడారంలో ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీల సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, వారి సంప్రదాయాలు, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని.. వారి సంప్రదాయంలో ఏమాత్రం మార్పు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

మిగతా 2వ పేజీలో..



## రాజీ పడేదే లేదు..

- కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం వాదనలు
- కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కు కోసం రాజీ లేదు
- ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తున్న ప్రభుత్వం
- 555 TMC నీరు కావాలని డిమాండ్
- కర్ణాటక ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపును వ్యతిరేకించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి


2

## వరంగల్‌లో కొత్త CGHS వెల్‌నెస్ సెంటర్

- కేంద్ర ఉద్యోగులు, పింఛనర్లు మరియు ప్రజలకు లాభం
- ప్రాథమిక OPD చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా అందుబాటు
- మంత్రి గి. కిషన్ రెడ్డి ట్వీట్ ద్వారా వివరాలు ప్రకటించారు

2





## తిరుమల శ్రీవారికి విలువైన కానుక సమర్పించిన ఎంపీ

- శ్రీవారికి రూ.60 లక్షల విలువైన స్వర్ణాభరణం సమర్పణ
- 535 గ్రాముల బరువున్న స్వర్ణాభరణం
- రంగనాయకుల మండపంలో ఆభరణాన్ని స్వీకరించిన అధికారులు
- వివరాలు వెల్లడించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

2

## ఇన్ని రోజులు ప్రజల రక్తం పీల్చి, ఇప్పుడు పన్నులు తగ్గించమని సంబరాలు

- ప్రజల రక్తం పీల్చి.. ఇప్పుడు పన్నులు తగ్గించమని సంబరాలు
- GSTపై, బీజేపీపై మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్.
- 6 నెలల్లో రూ.22 లక్షల కోట్లు వసూలు చేయడమే ప్రజల దోపిడీ



2



## సైబర్ నేరగాళ్ల కొత్త పంథా..

- పహల్గాం ఘటనను వాడుకుంటూ..
- పహల్గాం టెర్రర్ ఘటనను ఉపయోగించి భయపెట్టిన సైబర్ నేరస్తులు
- యాంటీ టెర్రర్ స్క్వాడ్ పేరుతో రిటైర్డ్ ఉద్యోగికి బెదిరింపులు
- 26.06 లక్షలు చెల్లించిన బాధితుడు
- డిజిటల్ అరెస్ట్ మోసంపై పోలీసులు హెచ్చరికలు, జాగ్రత్తలు

2



## త్వరలోనే డీసీసీ ల నియామక ప్రక్రియ

- తెలంగాణలో AICC పరిశీలకుల నియామకం
- జిల్లా అధ్యక్షుల ఎంపికపై సూపర్ పవర్స్
- నియామక ప్రక్రియలో పారదర్శకత
- లోకల్ నాయకత్వాన్ని బలోపేతం చేయడం

2

## గ్రూప్-1 తీర్పుపై హైకోర్టులో మరోసారి అప్పీల్ దాఖలు

- గ్రూప్-1 తీర్పుపై హైకోర్టులో మరోసారి అప్పీల్ దాఖలు
- జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు తీర్పు కొట్టివేయాలని పిటిషన్
- గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి పిటిషన్‌ను స్వీకరించిన సీజే ధర్మాసనం
- TGPSC కూడా పిటిషన్ దాఖలు చేసిందన్న పిటిషనర్
- రెండు పిటిషన్లు కలిపి విచారణ చేస్తామన్న హైకోర్టు

2






## పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది.. ఎన్నికలకు సిద్ధంగా ఉండండి: హరీశ్ రావు

- పల్లెల్లో గులాబీల జెండాను ఎగురవేసేందుకు కృషి చేయాలన్న హరీశ్ రావు
- కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలను గడపగడపకూ వివరించాలన్న హరీశ్ రావు
- కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను గడపగడపకూ వివరించాలని సూచన

2



## వరంగల్‌లో కొత్త CGHS వెల్‌నెస్ సెంటర్

- **కేంద్ర ఉద్యోగులు, పింఛనర్లు మరియు ప్రజలకు లాభం**
- **ప్రాథమిక OPD చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా అందుబాటు**
- **మంత్రి గి. కిషన్ రెడ్డి ట్వీట్ ద్వారా వివరాలు ప్రకటించారు**

**సిద్దిపేట(పవర్), హైదరాబాద్:**

వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వం సైన్యాధారిత ఉద్యోగులు, పింఛన్ పొందే పౌరులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి కొత్త సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (CGHS) వెల్‌నెస్ సెంటర్ ని ఆమోదించింది. ఈ సౌకర్యం ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్‌లకు ఉపయోగపడనుంది. అయితే, సీజీఎచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రాథమిక OPD చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉంటాయి.

నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ కార్యక్రమం ప్రారంభించడం, ఉద్యోగుల సంక్షేమం, సామూహిక ఆరోగ్య పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను మళ్ళీ ప్రస్తావిస్తుంది. ఇది "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" దార్శనికతకు సాక్ష్యంగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వరంగల్‌లో కొత్త వెల్‌నెస్ సెంటర్ ఆమోదం పొందిన విషయాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేశారు కిషన్ రెడ్డి. ఈ కొత్త సౌకర్యం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటం, ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక చొరవగా ఉంటుంది.



## త్వరలోనే డీసీసీ ల నియామక ప్రక్రియ

- **తెలంగాణలో AICC పరిశీలకుల నియామకం**
- **జిల్లా అధ్యక్షుల ఎంపికపై సూపర్ పవర్స్**
- **నియామక ప్రక్రియలో పారదర్శకత**
- **లోకల్ నాయకత్వాన్ని బలోపేతం చేయడం**

**సిద్దిపేట(పవర్), హైదరాబాద్:**

కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం (AICC) తెలంగాణలో డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియను సీరియస్‌గా ప్రారంభించడానికి ముందుగా 22 మంది పరిశీలకులను నియమించింది. ఈ నియామక ప్రక్రియలో జిల్లా స్థాయి బాధ్యతలు AICC పరిశీలకులకి అప్పగించబడ్డాయి. ప్రత్యేకంగా నియమించబడిన పరిశీలకులు ప్రతి జిల్లాలో డీసీసీ అధ్యక్షుల ఎంపికపై సూపర్ పవర్స్ కలిగి ఉంటారు. దీని ద్వారా నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, సమగ్రంగా జరుగుతుందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

తెలంగాణలోని డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం AICC పరిశీలకులు సీరియస్‌గా కసరత్తు చేస్తున్నారు. అన్ని నియామకాలు, నియమాలు కఠినంగా పరిశీలించి, అనవసర అడ్డంకులు లేకుండా అధ్యక్షులను ఎంచుకోవడం కోసం ఈ ప్రయత్నం జరుగుతోంది. పరీక్షల తర్వాత, పరిశీలకులు జిల్లా అధ్యక్షుల ఎంపికను ముగించి, AICC అధికారికంగా ప్రకటించనుంది. త్వరలోనే తెలంగాణలో ప్రతి జిల్లాకు డీసీసీ అధ్యక్షులు పూర్తి స్థాయిలో నియమించబడతారు. ఈ చర్య, కాంగ్రెస్ పార్టీలో లోకల్ లెవల్ నాయకత్వాన్ని పునర్నిర్మించడానికి, కేంద్రం , రాష్ట్ర నాయకత్వం మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడానికి కీలకంగా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## ఇన్ని రోజులు ప్రజల రక్తం పీల్చి, ఇప్పుడు పన్నులు తగ్గించమని సంబరాలు

- **ప్రజల రక్తం పీల్చి.. ఇప్పుడు పన్నులు తగించమని సంబరాలు**
- **GSTపై, బీజేపీపై మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్.**
- **6 నెలల్లో రూ.22 లక్షల కోట్లు వసూలు చేయడమే ప్రజల దోపిడీ.**

**సిద్దిపేట(పవర్), హైదరాబాద్:**

తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తు, సేవల పన్ను(GST) విషయంలో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పార్టీ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. GSTని ప్రవేశపెట్టినప్పుడే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దానిని "గబ్బర్ సింగ్ ట్యాక్స్"గా అభివర్ణించారని, ఇది దేశ ప్రజలకు దోచుకునే ఆయుధంగా మారిందని ప్రభాకర్ అన్నారు. పెట్రోల్, డీజిల్ వంటి వాటిని GST పరిధిలోకి తీసుకురావాలని రాహుల్ గాంధీ సూచించినా.. మోదీ ప్రభుత్వం దానిపై స్పందించలేదని ఆయన పేర్కొన్నారు. అలాగే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరు నెలల్లో GST ద్వారా రూ.22 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పడం అంటే, ఆరు నెలల్లో పేద ప్రజల నుంచి అంత మొత్తాన్ని దోచుకున్నట్టేనని ప్రభాకర్ ఆరోపించారు. ఇన్ని రోజులు ప్రజల రక్తం పీల్చుకుని, ఇప్పుడు పన్నులు తగ్గించి సంబరాలు చేసుకోవడం మూర్ఖత్వమని ఆయన అన్నారు. GST తగ్గిందని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా, నిత్యావసర వస్తువుల ధరలు ఏమైనా తగ్గాయా..? అని ప్రశ్నించారు. ఈ పన్ను పెంచింది ఎవరు? తగ్గించింది ఎవరు? అని అన్నారు. ఇంకా ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు నిజంగా లాభం జరిగిందా..? లేదా..? అని చూడాలని అన్నారు.

# రాజీ పడేదే లేదు..

- **కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం వాదనలు**
- **కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కు కోసం రాజీ లేదు**
- **ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తున్న ప్రభుత్వం**
- **555 TMC నీరు కావాలని డిమాండ్**
- **కర్ణాటక ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపును వ్యతిరేకించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.**

**సిద్దిపేట(పవర్), హైదరాబాద్:**



కృష్ణా జలాల వివాదంపై ఢిల్లీలో కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం తమ వాదనలను వినిపిస్తోంది. ఈ సందర్భంగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తమ వాదనల వివరాలను వెల్లడించారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచే అంశాన్ని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఈ విషయంలో సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో ఏ ప్రభుత్వం ఉన్నా తమ రాష్ట్ర వాటా విషయంలో రాజీ పడేది లేదని.. కృష్ణా, గోదావరి జలాల్లో తమ వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ తరపున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ మూడు రోజుల పాటు వాదనలు వినిపిస్తున్నారు. కృష్ణా నది ప్రవాహం, క్యాచ్‌మెంట్ ఏరియా, జనాభా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తమకు 70 శాతం నీటి వాటా కేటాయించాలని కోరుతున్నామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 555 TMCల నీటిని కేటాయించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో తాము ఏకీభవించడం లేదని, అందుకే ఫైల్ రీఓపెన్ చేసి మొదటి నుంచి వాదనలను వినిపిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అండర్ సెక్షన్ 3 రిఫరెన్స్ పై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, ఫిబ్రవరి నుంచి వాదనలు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం తుది వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. ఈ వాదనలపై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇప్పటికే బ్రీఫింగ్ జరిగిందని, తెలంగాణకు రావాల్సిన నీటి వాటా కోసం పూర్తిస్థాయిలో పోరాడుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## గ్రూప్-1 తీర్పుపై హైకోర్టులో మరోసారి అప్పీల్ దాఖలు

- **గ్రూప్-1 తీర్పుపై హైకోర్టులో మరోసారి అప్పీల్ దాఖలు**
- **జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు తీర్పు కొట్టివేయాలని పిటిషన్**
- **గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి పిటిషన్‌ను స్వీకరించిన సీజే ధర్మాసనం**
- **TGPSC కూడా పిటిషన్ దాఖలు చేసిందన్న పిటిషనర్**
- **రెండు పిటిషన్లు కలిపి విచారణ చేస్తామన్న హైకోర్టు.**

**సిద్దిపేట(పవర్), తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) నిర్వహించిన గ్రూప్1 నియామకాలపై కొనసాగుతున్న వివాదంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీలు చేసిన నేపథ్యంలో, తాజాగా గ్రూప్1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని ఆశ్రయించారు.

మార్చి 10న విడుదలైన గ్రూప్1 ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పలు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. వీటిని పరిశీలించిన హైకోర్టు సింగిల్ బెంచ్ జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, ఈ నెల 9న కీలక తీర్పు ఇచ్చారు. ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టు, మార్కుల జాబితాను రద్దు చేశారు. ఈ తీర్పుతో నియామకాల ప్రక్రియ నిలిచిపోయింది.



సింగిల్ బెంచ్ తీర్పుపై టీజీపీఎస్సీ అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ వాదనలను సరైన రీతిలో పరిగణలోకి తీసుకోలేదని పేర్కొంటూ డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేసింది. ఫలితాలు సక్రమంగానే ఉన్నాయని, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు అమలులోకి వస్తే నియామక ప్రక్రియ మరింత ఆలస్యమవుతుందని టీజీపీఎస్సీ వాదిస్తోంది.

తాజాగా, గ్రూప్1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి కూడా సింగిల్ బెంచ్ తీర్పును వ్యతిరేకిస్తూ అప్పీల్ దాఖలు చేశారు. తన నియామకం చట్టబద్ధమని, ఇప్పటికే పొందిన హక్కును కోర్టు తీర్పుతో రద్దు చేయరాదని పిటిషనర్ వాదించారు. ఈ పిటిషన్‌ను సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది.

ఒకవైపు టీజీపీఎస్సీ, మరోవైపు ఎంపికైన అభ్యర్థి చేసిన అప్పీల్‌స్‌తో గ్రూప్1 వివాదం మరింత క్లిష్టంగా మారింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఏ తీర్పు ఇస్తుందో అన్నది రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులలో ఆసక్తిని రేపుతోంది. ఈ కేసు తుది పరిష్కారం వచ్చేంతవరకు నియామకాలు నిలిచిపోవడం ఖాయమని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

## సైబర్ నేరగాళ్ల కొత్త పంథా..

- **పహల్గాం ఘటనను వాడుకుంటూ..**
- **పహల్గాం టెర్రర్ ఘటనను ఉపయోగించి భయపెట్టిన సైబర్ నేరస్తులు**
- **యాంటీ టెర్రర్ స్క్వాడ్ పేరుతో రిటైర్డ్ ఉద్యోగికి బెదిరింపులు**
- **26.06 లక్షలు చెల్లించిన బాధితుడు**
- **డిజిటల్ అరెస్ట్ మోసంపై పోలీసులు హెచ్చరికలు, జాగ్రత్తలు**

**సిద్దిపేట(పవర్), తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్‌లో ఓ 68 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి సైబర్ కేటుగాళ్ల మోసానికి గురయ్యాడు. నేరస్తులు తనను భయపెట్టడానికి పహల్గాం టెర్రర్ ఘటనను పునర్వినియోగం చేసుకున్నారు. ఫోన్‌లో మోసపోయిన వ్యక్తికి "పహల్గాం ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని, ఫండ్ రైజ్ చేసి మనీలాండరింగ్ చేశారు" అని అంటూ మోసం చేశారు.

నేరస్తులు తమను "యాంటీ టెర్రర్ స్క్వాడ్" అనే అధికారులుగా పరిచయం చేసి, డిజిటల్ అరెస్ట్ ఉంటుందని భయపెట్టారు. భయభ్రాంతులు వచ్చిన బాధితుడు నేరస్తులకు మొత్తం 26.06 లక్షల రూపాయలు చెల్లించాడు. భార్య పేరుతో ఉన్న 20 లక్షల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ ను కూడా నేరస్తులకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు వెల్లడించినప్పుడు వారు మోసపోయినట్లు గుర్తించారు.

భయంతో బాధితుడు వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే.. పోలీసులు, "డిజిటల్ అరెస్ట్ అనే చర్య ఉండదు. ఎవరైనా కాల్ చేసి డిజిటల్ అరెస్ట్ అని మభ్యపెడితే వెంటనే పోలీసులను సంప్రదించండి" అని ప్రజలకు హెచ్చరించారు. ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే వెంటనే పోలీస్‌కు ఫిర్యాదు చేయాలని, వ్యక్తిగత బ్యాంక్ వివరాలు ఎవరికి ఇవ్వకూడదని మరోసారి గుర్తు చేశారు. పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నేరస్తులను త్వరలో గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## తిరుమల శ్రీవారికి విలువైన కానుక సమర్పించిన ఎంపీ

- **శ్రీవారికి రూ.60 లక్షల విలువైన స్వర్ణాభరణం సమర్పణ**
- **535 గ్రాముల బరువున్న స్వర్ణాభరణం**
- **రంగనాయకుల మండపంలో ఆభరణాన్ని స్వీకరించిన అధికారులు**
- **వివరాలు వెల్లడించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

**సిద్దిపేట(పవర్), తిరుమల:**



కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మంగళవారం నాడు భారీ విరాళం సమర్పించారు. సుమారు రూ.60 లక్షల విలువైన అత్యంత అపురూపమైన స్వర్ణాభరణాన్ని ఆయన స్వామివారికి కానుకగా అందించారు.

ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి 535 గ్రాముల బరువున్న "అష్టలక్ష్మీ చంద్రవంక కంఠి" అనే స్వర్ణ కంఠాభరణాన్ని శ్రీవారికి సమర్పించినట్లు ఆయన తెలిపారు.

తిరుమలలోని రంగనాయకుల మండపంలో జరిగిన ఒక కార్యక్రమంలో, టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి తాము ఈ విరాళాన్ని స్వీకరించినట్లు ఛైర్మన్ పేర్కొన్నారు.

## పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది.. ఎన్నికలకు సిద్ధంగా ఉండండి: హరీశ్ రావు

**సిద్దిపేట(పవర్), హైదరాబాద్:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హామీ ఇచ్చారు. ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి ఆధ్వర్యంలో మాజీ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడించాలని సూచించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ హామీలను గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను గ్రామాల్లో గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఎంతలా ఇబ్బంది పడుతున్నారో ప్రజలకు వివరించాలని సూచించారు.

## 100 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి..

**మొదటిపేజీ తరువాయి**

ఆలయ అభివృద్ధిని డబ్బులతో కాకుండా భక్తితో చూడాలని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా పనులు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, పనులను పూర్తి చేసే బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. అలాగే నిర్మాణాలు రాతి కట్టడాలతో ఉండేలా, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

ఇంకా ఆలయ అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. తన రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను దర్శించుకుంటున్నానని ఫిబ్రవరి 6, 2023న ఈ గద్దె నుంచే పాదయాత్ర మొదలుపెట్టానని, అమ్మవార్ల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆదివాసీల పోరాటానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తి అని కొనియాడారు. చివరగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ పూజారులను సత్కరించారు. అలాగే ఆయన నిలువెత్తు బంగారాన్ని (68 కేజీల బెల్లం) అమ్మవారికి సమర్పించారు.



# పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ ఈ వానాకాలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు కోరారు. మంగళవారం తీగుల్ గ్రామంలో జరుగుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీలోగా పత్తి, 30వ తేదీలోగా మిగిలిన అన్ని పంటలను రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల వివరాలు ఇప్పుడు నమోదు చేయించుకోనట్లయితే పంటలు అమ్మేటప్పుడు ఆన్లైన్లో ఉన్న పంటలను మాత్రమే ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈసారి నమోదు చేసిన తర్వాత పంటలు అమ్మేటప్పుడు ఎలాంటి మార్పులు చేర్పులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయి ప్రసన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వం చేయలేని పని ప్రజా ప్రతినిధి చేశాడు

**చేర్యాల, సెప్టెంబర్ 23 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం ముస్త్యాల గ్రామం గ్రామ పంచాయతీ లో పని చేస్తున్న సిబ్బంది కి 5 నెలల నుండి జీతాలు రావడం లేదు..ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి, వారి బావ అయిన ప్రతాప్ రెడ్డి బాలమని (NRI) కి తెలియజేయగా వారు సహృదయం తో మనిషికి 5000 రూపాయల చొప్పున 45000 రూపాయలు అందించారు.. నేడు ఆ ఆర్థిక సాయాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది కి ఎల్లారెడ్డి అందించారు..పండగ సమయంలో ఇలాంటి సాయం అందించిన NRI ప్రతాప్ రెడ్డి బాలమని కి, ఎల్లారెడ్డి కి సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు..ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికీ అయిన స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బంది కి వేతనాలు విడుదల చేయాలి అని విజ్ఞప్తి చేశారు.



# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

- **బిజీ వెంకటాపూర్ గ్రామ యువ నాయకులు చెక్కల పరమేశ్వర్ ముదిరాజ్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండలం బిజీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొంతం దర్శనం హాస్పిటల్ లోచేరగా అధిక ఖర్చులుకాగా గ్రామ యువ నాయకులు చెక్కల పరమేశ్వర్ ముదిరాజ్ దృష్టికి తీసుకెళ్లగా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి సహకారంతో సీఎం ఆర్ యఫ్ చెక్కు కొంతం దర్శనంకి 60 అరవై వేల రూపాయలు మంజురైయ్యాయి.లబ్ధిదారునికి ఇట్టి చెక్కును గ్రామ యువ నాయకులు చెక్కల పరమేశ్వర్ ముదిరాజ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కుటుంబ సభ్యులు ఈ చెక్కు మంజూరులో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్సీ యాదవ రెడ్డి కి, గ్రామ యువకుడు చెక్కల పరమేశ్వర్ ముదిరాజ్ కి కృతజ్ఞతలు తెలిపినారు. వీరితో పాటుగా ఈకార్యక్రమంలో గ్రామ యువకులు రాజు, మల్లేశం, కర్ణకార్, సుధాకర్, గణేష్ ,రమేష్ , కిషోర్ , బాలరాజు ,వెంకటేష్

మల్లేశం, రూపేష్,నందు
సుదర్శన్ నర్సింలు ఉపేందర్
గణేష్ హరీష్ వెంకటేష్
బాల్ నర్సు,బోయిని వెంకటేష్ ,వంశీ,తదితరులు ఉన్నారు.

# స్వస్త్ నారి స్వస్తిక్ పరివార్ అభియాన్ కార్యక్రమం

- **జగదేవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం**
- **డాక్టర్ సత్యప్రకాష్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ లో భాగంగా మంగళవారం రోజున జగదేవపూర్ ప్రాథమిక అరోగ్య కేంద్రం నందు డాక్టరు సత్యప్రకాష్ అధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో ఈ కింది విభాగాలు పిల్లల వైద్య నిపుణులు సాయికిరణ్ జనరల్ మెడిసిన్ వెంకట సాయి స్త్రీ వైద్య నిపుణులు మన్విత చర్మ వైద్య నిపుణులు సుష్మిత కంటి వైద్య నిపుణులు సంధ్యారాణి చెవి ముక్కు గొంతు వైద్య నిపుణులు కల్యాణ చక్రవర్తి పళ్ల వైద్య నిపుణులు శ్రీజ మానసిక సంబంధిత వైద్య నిపుణులు మనోజ్ కుమారు పాల్గోన్నారు. ఈ సందర్భంగా డాక్టరు మాట్లాడుతూ సుమారు 223 మంది వివిధ విభాగాలలో తమ జబ్బులను పరీక్షించుకున్నారు అవసరమయిన వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో కంటి వైద్య సహాయకులు తిరుపతి రెడ్డి ,టీబీ సూపర్ వైజర్ వలియోద్దీన్ , పిహెచ్ సి స్టాఫ్ ఆశా కార్యకర్తలు పాల్గోన్నారు.







# ఐకెపి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి సెప్టెంబర్ 23**

మిరుదొడ్డి మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆటలు ఆడారు. బతుకమ్మ వేడుకల్లో తహసిల్దార్ శ్రీనివాసరెడ్డి , ఏపిఎం లక్ష్మీనరసమ్మ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణానికి హాని కలిగించకుండా ప్రకృతి సిద్ధంగా లభించే పూలతో బతుకమ్మలను తయారు చేయాలని మహిళలకు సూచించారు. కెమికల్ తో తయారు చేసిన బతుకమ్మల ద్వారా నీటి కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని వెల్లడించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ ఆటలు ఆడడంతో నూతన ఓరవడి నెలకొంది. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సిసిలు వైకుంఠం బాలరాజు మనమ్మ జ్యోతి వరలక్ష్మి ప్రభాకర్ , బి ఓ ఏ లు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగరీత్యా బదిలీలు తప్పనిసరి అని ఏపిఎం లక్ష్మీనరసింహ అన్నారు

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి సెప్టెంబర్ 23**

మంగళవారం మిరుదొడ్డి మండల మహిళా సమైక్య కార్యాలయంలో బదిలీపై వెళ్లిన సీసీలకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా బదిలీలు ఉంటాయన్నారు .మండలంలో పది సంవత్సరాలు ఇందిరా గాంధీ పథకంలో పనిచేసిన సీసీలు మహిళా సంఘాలతో పనిచేస్తూ మహిళ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని తెలిపారు. గ్రామాలలో మహిళా సంఘాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేశారని తెలిపారు. మిరుదొడ్డి నుండి బదిలీపై వెళ్లిన దేవదాస్ ఆ సిద్ధిరాములు శ్రీనివాస్ కు సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో సిసిలు వైకుంఠం, బాలరాజు, మనమ్మ, జ్యోతి, వరలక్ష్మి, వివో ఏలు వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టును తొలగించిన మిరుదొడ్డి పోలీస్

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి సెప్టెంబర్ 23**

సిద్దిపేట జిల్లా మండల పరిధిలోని ఆరోపల్లె గ్రామం వద్ద నిన్న అర్ధరాత్రి కురిసిన వర్షం కారణంగా మిరుదొడ్డి నుంచి ధర్మారం వైపు వెళ్లే మార్గమధ్యంలో ఆరేపల్లి గ్రామం వద్ద రోడ్డుపై అడ్డంగా చెట్టు పడి ఉన్నది అని నైట్ డ్యూటీ లో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బంది అయిన రాజు, బాలకృష్ణ, శ్రీకాంత్ గమనించి మిరుదొడ్డి ఎస్ఐ సమత కి తెలుపగా కూడా అక్కడికి వచ్చి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించినారు.



# భారత ప్రధాన న్యాయమూర్తిని కించపరిచిన న్యాయవాదుల లైసెన్స్ రద్దు చేయాలి ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్

- **నిందితులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం- తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహ రెడ్డి**

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహ రెడ్డికి సిద్ధిపేట బార్ అసోసియేషన్ అడ్వకేట్స్ మరియు ఎస్సి, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ న్యాయవాదులు మరియు హైకోర్టు అడ్వకేట్స్ కలిసి భారత ప్రధాన న్యాయమూర్తిపై అనుచిత హఖ్యలు చేసి అవమానించిన సిద్ధిపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు పొద్దుటూరి శ్రీకాంత్ వైశ్య, ఎం. మురళి మోహన్ రావు బ్రాహ్మణ న్యాయవాదులపై పిర్యాదు చేశారు. సదరు న్యాయవాదులు కనకము సింహాసనమున, వెనుకటి ఊరి శూనకాలు మలము తినేవి, వెనకటి శూనకాలు మళ్ళీ వస్తాయి అనుకోలేదు, ప్రస్తుతానికి ఢిల్లీలో ఒకటి లభ్యమైనదని, రెండేళ్ళకోసం మొన్ననే ఓ శూనకాన్ని కుర్చీలో కూర్చుండబెట్టారు, అతి తెలివి మాటలు మాట్లాడం దాని అలవాటు అని అసభ్య పదజాలంతో భారత ప్రధాన న్యాయమూర్తిని కించపరుస్తూ దూషించారని, కుల మతోన్మాదముతో అడిగిన న్యాయవాదులపై అహంకారపూరీత దొరనితో అనుసరించారని తెలిపారు. సిద్ధిపేట పోలీస్ స్టేషన్ నందు వారిపై కేసు నమోదయ్యిందని, వారి యొక్క ఎన్రోల్మెంట్ సర్టిఫికెట్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశారు. హైకోర్టు నందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు ను, అడిషినల్ అడ్వకేట్ జనరల్ తెరా రజినీకాంత్ ను కలిసి విజప్తి చేశారు. ఇట్టి పిర్యాదుపై బార్ కౌన్సిల్ చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్ట్ అడ్వకేట్స్ కొమ్ము ప్రవీణ్ కుమార్, పోలె విష్ణు, చందులాపురం భూపతి, సిద్ధిపేట న్యాయవాదులు ఎ. బాపురావు, కర్రోళ్ల రవిబాబు,యాదగిరి, పల్లెటూరి ప్రసాద్, బత్తుల రాజు, పత్రి ప్రకాశ్, పర్వతం రాములు, జేరిపోతుల యాదగిరి, బైరి ప్రవీణ్, రాగుల బాబు, ఎర్ర సాగర్,బాల్ రాజ్, అశోక్, శంకర్, ఎల్లం, ప్రవీణ్, పుణేందర్, యెలా బాలరాజు, శ్రీనివాస్, దుబ్బ రాజశేఖర్, శ్రీనివాస్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ కార్యక్రమాలకా రియల్ వ్యాపారుల కోసమా..!

- **ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్వాణపై పోలీసులకు ఫిర్యాదు..!**
- **ఎమ్మెల్యే ఓఎస్ డి ఎక్కడ..?**
- **బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్.**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు కోసం సమావేశాలు పెట్టవలసిన చోట రియల్ వ్యాపారులు సమావేశాలు ఏర్పాటు చేస్తే ఎమ్మెల్యే ఓ ఎస్ డి ఏం చేస్తున్నట్లుని బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్ ప్రశ్నించారు.మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

రియల్ వ్యాపారులు సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారని వాటిని చూసి ఎమ్మెల్యే ప్రత్యేక అధికారి ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన ప్రశ్నించారు.

పట్టణంలో ముట్రాజ్ పల్లి రోడ్డు లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల సమావేశాలకు వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అలాంటి వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఎమ్మెల్యే మినహా ఇతరులు ఎవరు సమావేశాలు ఏర్పాటు చేయకూడదని గతంలోనే తాము ఫిర్యాదు చేశామని ఆయన గుర్తు చేశారు. జన్మదిన వేడుకలు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల సమావేశాలకు వాడుకుంటున్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కుడిక్యాల రాములు, సిద్దిపేట జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, సిద్దిపేట జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకటరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు నాగు ముదిరాజ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్ మడుగురి నరసింహ ముదిరాజ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బీజేపీ కార్యదర్శులు చిక్కుడు ప్రసాద్ పంజాల శివకుమార్ గౌడ్, బిజెపి నాయకులు మంద వెంకట్, కాళ్ల సాయికుమార్, బత్తిని నరేష్, శివలింగు బాలరాజ్, తుప్పతి నరేష్, చిక్కుడు సాయి, కోటే స్వామి తదితరులు పాల్గొన్నారు.




# ఎస్సై నీ ఆహ్వానించిన సేవా ట్రస్ట్ సభ్యులు

**చేర్యాల, సెప్టెంబర్ 23 (సిద్దిపేట పవర్)**


ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలకు చేర్యాల ఎస్సై వేముల నవీన్ ను సేవా ట్రస్ట్ సభ్యులు గోనేపల్లి మహేష్ ఆహ్వానించారు... గత కొన్ని సంవత్సరాలుగా ఆకునూరు గ్రామంలో భవాని రుద్రేశ్వర ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుచున్నారు, ఈ సంవత్సరం కూడా అదే విధంగా ఉత్సవాలు జరుగుతున్న క్రమంలో ఎస్సై నవీన్ వాటికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇవ్వడం జరిగింది... ఆహ్వానించిన వారిలో బుద్ధుని బాలాజీ, పల్లె అరవింద్ లు ఉన్నారు..



# హైకోర్టు ఆదేశాలను అమలు చేయని తెలంగాణ ప్రభుత్వం

- **కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసిన డాక్టర్**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23( సిద్దిపేట పవర్ ):**



డాక్టర్ల పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లెక్కింపులో తాత్కాలిక సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని 2012లో అప్పటి ఏపీ ఉమ్మడి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను వ్యతిరేకిస్తూ ప్రభుత్వం హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్ (12349/2014) ను హైకోర్టు కొట్టివేసింది. అనంతరం ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన ఎస్ఎల్పీ (24179/2019) కూడా డిస్మిస్ అయింది. ఈ క్రమంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ జూన్ 27, 2025న జీ.ఓ. నెం.423 విడుదల చేసింది. కానీ తెలంగాణా ప్రభుత్వం మాత్రం జనవరి 27, 2025న తెలంగాణా హైకోర్టు ఇచ్చిన తుది ఆదేశాలను ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఈ విషయమై తాను అనేక వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేక కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశామని డాక్టర్ జి. హనుమాన్లు తెలిపారు.




# వైద్యుల పై దాడి చేసిన దోషుల పై చర్యలు తీసుకోవాలి

- **తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్**
- **లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23 ( సిద్దిపేట పవర్ ) :**

మహబూబాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీనివాస్ పై జరిగిన సామూహిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ లు పేర్కొన్నారు. అందులో భాగంగా గాంధీ యూనిట్ తెలంగాణ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంతటి వారైనా వైద్యుల పై దాడి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ దారుణ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని అరెస్టు చేయాలని కోరారు. గాంధీ యూనిట్ అధ్యక్షులు డాక్టర్ భూపేందర్ రాథోడ్ మాట్లాడుతూ వైద్యులు దేవుళ్లు కాదని - ప్రతి రోగి ప్రాణాన్ని కాపాడేందుకు వైద్యులు ఎల్లప్పుడూ తమ వంతు కృషి చేస్తారని,ఏ వైద్యుడు కూడా ఉద్దేశపూర్వకంగా హాని చేయడని, ఇలాంటి హింసాత్మక చర్యలు సమాజానికి హానికరమని,అంకితభావంతో పని చేసే డాక్టర్ల మనోధైర్యాన్ని దెబ్బ తీస్తాయని అన్నారు. ఈ ఘటనపై పోలీస్ శాఖ నిష్పాక్షికంగా, పారదర్శకంగా దర్యాప్తు చేసి దోషులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. గాంధీ యూనిట్ సెక్రటరీ జనరల్ డాక్టర్ అబ్బయ్య , కోశాధికారి డాక్టర్ రవి , రాష్ట్ర నాయకులు డాక్టర్ మురళి, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ వెంకట మణి, డాక్టర్ రాంబాబు, డాక్టర్ వంశీ కృష్ణ , డాక్టర్ దివ్యా రాణి, డాక్టర్ సుబోధ్, డాక్టర్ కృపాల్ సింగ్, డాక్టర్ రాజేష్, డాక్టర్ నాజిమ్, డాక్టర్ మురళీ కృష్ణ, డాక్టర్ నవీన్, డాక్టర్ రమేశ్ , డాక్టర్ లక్ష్మీ కాంత్ , డాక్టర్ మీనాక్షీ, డాక్టర్ సరిత తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అమ్మవారి రెండవ రోజు పూజా కార్యక్రమం...

**సెప్టెంబర్ 23:**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్‌లో శ్రీ మహా జ్వాలా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ పదో వార్షికోత్సవ వేడుకల రెండవ రోజు గాయత్రీ మాత దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి పూజా కార్యక్రమంలో గిరి, అనూష దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఆవహించారు.



# బతుకమ్మ మొదలైన ఇంకా అందని బతుకమ్మ చీరలు

- **బిఆర్ఎస్ చేర్యాల మండల నాయకులు శనిగరం లక్ష్మణ్**

**చేర్యాల, సెప్టెంబర్ 23 (సిద్దిపేట పవర్)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగ మొదలు అయినా కూడా బతుకమ్మ చీరలు ఇంకా మహిళలకు అందలేదని శనిగరం లక్ష్మణ్ తెలిపారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ చీరలను పేరు మార్చి ఇందిరమ్మ చీరలు గా పెట్టారు, కనీసం ఆ చీరలు అయిన ఇంతవరకు పంపిణీ చేయలేదు.. కేసీఆర్ ప్రభుత్వం ఒకటే ఇచ్చింది మేము రెండు చీరలు ఇస్తాము అని చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఒక్క చీర కూడా ఇవ్వలేని స్థితిలో ఉంది అని లక్ష్మణ్ ఎద్దేవా వేసాడు..మహిళా సంఘాలకు చీరల పంపిణీ బాధ్యత ఇస్తే, మహిళ సంఘాలలో లేని మిగతా మహిళల ఎవరికి ఇస్తారు..??ముసలి వాళ్లకు ఎవరు ఇస్తారు..??అని ప్రశ్నించాడు..కనీసం బతుకమ్మ పండుగ పూర్తి అయ్యేలోపు అయిన చీరలు అందించాలని ఆయన తెలిపారు..



# మోకాలి శస్త్రచికిత్స తర్వాత జాతీయ క్రీడల్లో రజత పతకం

- **సెపక్‌తక్రా క్రీడాకారిణి నవత విజయగాథ**
- **శిక్షణలో ఉండగా పూర్తిగా దెబ్బతిన్న ఏసీఎల్**
- **సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స, ఫిజియోథెరపీ**
- **కోలుకుని క్రీడల్లో తిరిగి మెరిసిన యువతి**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23 ( సిద్దిపేట పవర్ ) :**

చిన్ననాటి నుంచే సెపక్‌తక్రా ఆటగాళ్లలో ఒకరుగా ఎదిగారు నవత. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధమవుతున్న ఆమె, 2024 ఆసియా క్రీడల్లో పాల్గొనాలనే లక్ష్యంతో గోవాలో శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. అయితే, శిక్షణ సమయంలో మోకాలికి తీవ్ర గాయం ఏర్పడింది. ఆ గాయాన్ని అధిగమించి, మళ్లీ తిరిగి బరిలోకి దిగి ఈసారి జాతీయ స్థాయిలో రజత పతకాన్ని గెలుచుకున్నారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ఆర్థ్రోస్కోపి, జాయింట్ రీప్లేస్‌మెంట్ మరియు స్పోర్ట్స్ సర్జన్ డాక్టర్ హరిప్రకాష్ ఆమె చికిత్స గురించి వివరించారు.

**నవతకు శిక్షణలో ఉండగా మోకాలికి తీవ్ర గాయం:**

నవత శిక్షణలో ఉండగా మోకాలికి తీవ్రమైన గాయం అయ్యింది. నొప్పి ఎక్కువగా ఉండటంతో, ఇంటర్నెట్‌లో అన్వేషించి మమ్మల్ని సంప్రదించారు. పరీక్షల తర్వాత ఆమెకి ఉన్న గాయం - పూర్తిగా నాశనమైన ఏసీఎల్ (యాంటీరియర్ క్రూషియేట్ లిగమెంట్) అని నిర్ధారించాం. ఇది మోకాలిలో ప్రధాన లిగమెంట్‌లలో ఒకటి. గాయం తీవ్రంగా ఉండటంతో శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. మొదట వాపు తగ్గేందుకు రెండు వారాల పాటు వేచి ఉన్నాం. అనంతరం ఆమె తన మోకాలిలో ఉండే మరో లిగమెంట్‌ను తీసుకుని మళ్లీ అమర్చాం. ఫిజియోథెరపీ తర్వాత ఆమె పూర్తిగా కోలుకుని తిరిగి ఆటను ప్రారంభించారు. అంతకుమించి, జాతీయ స్థాయిలో పతకం సాధించడం ఆనందదాయకం.

**ట్రీట్మెంట్ ఇలా.....**

తొడ నుండి లిగమెంట్ తీసుకుంటే శరీరానికి ఎలాంటి హాని ఉండదు. పైగా శరీరం త్వరగా అంగీకరిస్తుంది. కృత్రిమ లిగమెంట్లను ఉపయోగిస్తే అంగీకారం కొంత ఆలస్యం అవుతుంది. ఒకటి కంటే ఎక్కువ లిగమెంట్లు దెబ్బతినినప్పుడు



మాత్రమే కృత్రిమ లిగమెంట్లు ఉపయోగిస్తాం. గాయాలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం. అప్పుడు ఏసీఎల్ మాత్రమేనా, లేక మెనిస్కస్ గానీ, కార్టిలేజ్ గానీ దెబ్బతిన్నాయా అన్నది తెలుసుకోవచ్చు. లిగమెంట్ గాయాలు అయితే వాపు తగ్గిన తర్వాతే శస్త్రచికిత్స చేస్తాం. శస్త్రచికిత్స తర్వాత ఫిజియోథెరపీ కూడా ఎంతో కీలకమని డాక్టర్ హరిప్రకాష్ తెలిపారు.

**తిరిగి ఆడగలనని అనుకోలేదు" – నవత**

ఆసియా క్రీడలలో ఆడే అవకాశానికి చాలా ఉత్సాహంగా గోవాలో శిక్షణలో పాల్గొన్నాను. కానీ అక్కడ మోకాలికి గాయం కావడంతో ఎంతో షాక్‌కి లోనయ్యాను. వెంటనే బెస్ట్ స్పోర్ట్స్ సర్జన్ ఎవరో ఇంటర్నెట్‌లో వెతికాను. అప్పుడే కిమ్స్‌లో డాక్టర్ హరిప్రకాష్ పేరును చూశాను. మా సొంత ఊరు ఇక్కడే కావడంతో వెంటనే ఆస్పత్రికి వచ్చి చూపించుకొని శస్త్రచికిత్స చేయించుకున్నాను.ఆ తర్వాత ముంబైలో ఆదాయపన్ను శాఖలో ఉద్యోగం రావడంతో ఫిజియోథెరపీకి ఎక్కువ సెలవులు తీసుకోలేకపోయాను. అందువల్ల కోలుకోవడానికి సుమారు 8-10 నెలలు పట్టింది. తర్వాత నెమ్మదిగా తిరిగి ప్రాక్టీస్ మొదలుపెట్టాను. 2024 అక్టోబర్, నవంబర్ నెలల నుంచి తిరిగి శిక్షణ కొనసాగించాను.సెపక్‌తక్రా అనేది లెగ్ వాలీబాల్ లాంటి ఆట. చెయ్యి తాకితే ఫౌల్ అవుతుంది. మోకాళ్లతో ఎక్కువ పనివుంటుంది. అటువంటి ఆటను మోకాలి శస్త్రచికిత్స తర్వాత మళ్లీ ఆడగలనని నేను అనుకోలేదు. కానీ డాక్టర్ చేసిన శస్త్రచికిత్స విజయవంతంగా జరగడంతో నేను పూర్తిగా కోలుకుని జాతీయ స్థాయిలో పతకం సాధించగలిగాను అని నవత ఆనందం వ్యక్తపరిచారు.



# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి భోజనం చేసిన మంత్రి వివేక్

- **లబ్ధిదారులతో భేటీ నిర్మాణం వేగవంతం చేయాలని సూచన**

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట;రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం సిద్దిపేట జిల్లాలోని 37వ వార్డు అంబేద్కర్ నగర్ మరియు ఎంసాన్పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎన్సాన్పల్లిలో లబ్ధిదారులతో కలిసి సహ భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సిద్దిపేట ఆర్డీవో సదానందం తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, “నిరుపేదల ముఖాల్లో ఆనందం చూడటం సంతోషాన్ని కలిగిస్తుంది. పారదర్శకంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు నాణ్యతతో ఇళ్లు నిర్మాణం జరుగుతోంది. 37వ వార్డులో 78, ఎంసాన్పల్లిలో 127 ఇండ్లు మంజూరు చేశాము,” అని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు ఆటోమేటిక్ గా మంజూరవుతున్నాయని, బేస్మెంట్ పూర్తి చేసిన తర్వాత రూ.1 లక్ష, వాల్ నిర్మాణం పూర్తయ్యాక మరో లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రెండు లక్షలు, చివరగా మరో లక్ష చొప్పున చెల్లిస్తున్నామని వివరించారు. 600 స్క్వేర్ ఫీట్లకు మించకుండా ఇండ్లు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మరోవైపు, “డిసెంబర్ తర్వాత సిద్దిపేట నియోజకవర్గానికి మరో 3500 ఇండ్లు మంజూరు చేయిస్తాను. ఇసుక కొరత లేకుండా మైనింగ్ శాఖతో చర్చించి సిద్దిపేటలో ఇసుక బజార్ ఏర్పాటు చేస్తాం,” అని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 17 లక్షల ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల అభివృద్ధికి ఉచిత కరెంటు, రూపాయికి గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు అమలవుతున్నాయని మంత్రి వెల్లడించారు.

ఇక తక్కువ ఖర్చుతో నీటి సరఫరా కోసం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా గ్రావిటీ ఆధారిత నీటిని అందించాలన్న ఆలోచనను కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.





# కృష్ణానగర్–కవాడిగూడ రోడ్‌లో పూర్తి అధ్వాన్నంగా డ్రైనేజీ వ్యవస్థ

- **డ్రైనేజీ మురుగు నీటికి తోడు వర్షపు నీరు..**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23 ( సిద్దిపేట పవర్ ) :**

బన్సీలాల్ పేట డివిజన్ కృష్ణానగర్ కాలనీ ఎల్ఐసి బిల్డింగ్ నుంచి కవాడిగూడ రోడ్ వరకు డ్రైనేజీ లైన్లు దెబ్బతినడంతో మురుగు నీరు వీధుల్లోకి వచ్చి పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మసీదు వద్ద వెదురు బొంగుల దుకాణాల వద్ద ఎక్కువగా నీరు చేరి వ్యాపారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.ఈ సమస్యపై గతంలో చాలా సార్లు అధికారులకు విజ్ఞప్తి చేస్తే ఈ సమస్య తమ పరిధిలోకి రాదని అటు జలమండలి, ఇటు జీహెచ్ఎమ్సీ అధికారులు చెబుతున్నారని స్థానిక నాయకులు పేర్కొన్నారు. చివరికి స్థానికులు జలమండలి జీఎం వినోద్‌కుమార్ , ఏజీఎం ఆశిష్, డివిజనల్ ఇంజనీర్ సన్నీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు మంగళవారం క్షేత్రపర్యటనకు వచ్చి, సమస్యను పరిశీలించారు. చాలా కాలంగా ఈ మురుగు నీటి సమస్యతో తాము నరకం చూస్తున్నమని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు. జలమండలి, జీహెచ్ఎమ్సీ అధికారులు సమన్వయంతో పనిచేసి, తమ సమస్యను పరిష్కరించాలని స్థానిక నాయకులు శీలం శివలింగం,షాయద్,ఎల్లేశ్,శ్రీనివాస్,దుర్గేశ తదితరులు కోరారు.

